అసంపూర్తి పనులు.. అవస్థల్లో ప్రజలు

- ప్రమాదకర గుంతను పూడ్చాలంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


బస్టాండ్ ఆవరణలో పారుతున్న మురుగు


బస్టాండ్ బయటకు వెళ్లేదారిలో ఏర్పడిన డ్రైనేజీ గుంత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో మురికికాలువ సరిగా లేకపోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. దీంతో ప్రతిరోజు బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు మురికికాలువ నుంచి వచ్చే దుర్వాసన భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించాల్సి ఉన్నా వాటిపై దృష్టిసారించడం లేదు. ప్రతిరోజు వందల సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. బస్సు బయటకు వెళ్లేటప్పుడు డ్రెయినేజీ వల్ల గుంతలు పడటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల బస్సు బయట కు వెళ్లే సమయంలో గుంతలో పడటంతో తీసేందుకు డ్రైవర్ తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రాత్రి సమయంలో గుంత ఏర్పడకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికితోడు మురుగు బస్టాండ్ ప్రాంగణమంతా పారడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురికికాలువను నిర్మించాల్సిన అవస రం ఎంతైనా ఉంది.

అదుపు తప్పితే ప్రమాదమే..

ప్రతిరోజు వాహనదారులు తమ బంధువులను బస్టాండ్‌కు వచ్చి వదిలేసి వెళ్తుంటారు. ఈ క్రమంలో వాహనదారులు అదుపు తప్పి గుంతలో పడితే ప్రమాదాలు జరుగుతాయని వారు భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు డ్రెయినేజీ నిర్మిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని వాహనదారులు, బస్సు డ్రైవర్లు అంటున్నారు.

త్వరలోనే డ్రైనేజీ నిర్మిస్తాం

బస్టాండ్ సమీపంలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటాం.
– ఎ రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ముగిసిన పదో తరగతి పరీక్షలు


ఆర్మూర్‌లో విజయకేతనం చూపిస్తున్న విద్యార్థులు


బాల్కొండలో..


రుద్రూర్‌లో..

సాక్షి, నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఆర్మూర్‌లోని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలను బాగా రాసినట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలో మొత్తం 453 మందికి 451 మంది పరీక్ష రాయగా ఇద్దరు గైర్హాజరయ్యారు. రుద్రూర్ మండలం అంబం(ఆర్) శివారులోని మోడల్ స్కూల్‌లో, మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. మండలంలో 372 మందికి 371 మంది పరీక్ష రాయగా ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కోటగిరి ఉమ్మడి మండలంలో మూడు పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కోటగిరిలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 316 మంది విద్యార్థులకు అందరు హాజరు కాగా, పోతంగల్‌లో 160 మందికి ఒకరు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

జీవన్‌రెడ్డికి సన్మానం



పెర్కిట్: కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని ఆర్మూర్ మండలం అంకాపూర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న జీవన్ రెడ్డిని పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు ముక్కెర విజయ్, ఉదయ్, నవనీత్, ముత్యం, సంజీవ్, చిరంజీవి ఉన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యశ్రీనివాస్‌ను బీజేపీ నాయకులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి నర్సారెడ్డి మున్సిపల్‌లో గత నాలుగేళ్లుగా జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కంచెట్టి గంగాధర్, పాలెపురాజు, ఆకుల శీను, మందుల బాలు ఉన్నారు.

చైత్రికకు అభినందనలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని పి.చైత్రిక నటరాజ నంది శివ కళా పురస్కార అవార్డు అందుకుందని ప్రిన్సిపాల్ ముత్తు తెలిపారు. కీర్తి ఆర్ట్ అకాడమీ వారి ఆధ్వర్యంలో శివరాత్రి, జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హైదరబాద్‌లో నిర్వహించిన క్లాసికల్ డ్యాన్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి అవార్డు అందుకుందన్నారు. పాఠశాలలో విద్యార్థిని చైత్రికను ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కమ్మర్‌పల్లి: మండలంలోని నర్సాపూర్‌లో రైతులు, గ్రామస్తులకు రోడ్లపై ధాన్యం ఆరబోతపై ఎస్సై రాజశేఖర్ శనివారం అవగాహన కల్పించారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. పోలీసుల ఆదేశాలను బేఖాతర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయంలో పూజలు

బాల్కొండ: జలాల్‌పూర్‌లోని రంగనాథుని ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుణ్యాహవచనం, హోమం చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

పశువులకు గాలికుంటు టీకాలు

డొంకేశ్వర్: మండలంలోని సిర్పూర్‌లో పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు వేశారు. గ్రామంలోని పశువులకు వ్యాధి విస్తరించి అనారోగ్యానికి గురవుతున్నాయని రైతులు పశువైద్య అధికారులకు సమాచారం ఇవ్వడంతో శనివారం 483 పశువులకు టీకాలు వేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశువైద్య సిబ్బంది రైతులకు సూచించారు.

పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలో అధికారులు శనివారం ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆస్తి పన్ను వసూలు చేశారు. అధికారులు ఇంటింటికి వెళ్లి ఇంటి పన్ను చెల్లిస్తే అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యమవుతుందని గ్రామస్తులకు వివరించారు. కార్యదర్శి రాజ లింగం, కారోబార్ సంతోష్, సిబ్బంది భూమన్న, సాయిలు తదితరులు ఉన్నారు.

కుర్నాపల్లిలో గ్రామసభ

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లిలో గ్రామ సమస్యలపై శనివారం గ్రామ సభ నిర్వహించారు. సభకు గ్రామ ప్రత్యేక అధికారి గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వెంకయ్యగారి రాంరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఉన్న జీపీ కార్యదర్శులు ఎన్నో అవకతవకలకు పాల్పడ్డారని అలాంటి వారిపై ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇకనైనా అధికారులు తమ పనితీరు మర్చుకొని ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా పొంతనలేని సమాధానం చెప్పారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సజ్జ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బాల్కొండ: సజ్జ పంటలో కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలను చేపట్టాలని భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య అన్నారు. ముప్కాల్ మండలం రెంజర్లలో కత్తెర పురుగు సోకిన సజ్జ పంటను శనివారం పరిశీలించారు. కత్తెర పురుగు జీవిత చక్రాన్ని 35 రోజుల్లో వేగంగా పూర్తి చేసుకుంటుందన్నారు. పురుగుల నివారణకు సరైన మందులు వాడాలన్నారు. వ్యవసాయ అధికారి రాజుకుమార్, రైతులు ఉన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి


లక్కోరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజలకు వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని లక్కోరలో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిందన్నారు. ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వీడియో ద్వారా ప్రదర్శించారు. ఎంపీ అర్వింద్ ఏనాడు పార్లమెంట్ పరిధిలోని గ్రామాల్లో పర్యటించలేదన్నారు. పసుపుబోర్డు ఎక్కడ ఏర్పాటు చేయించాడో చూయించాలని డిమాండ్ చేశారు. ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. దేవుని పేరు చెప్పుకొని బీజేపీ రాజకీయాలు చేయడం తప్ప చేసిందేమి లేదన్నారు. రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ప్రాతినిధ్యం చాలా అవసరం అన్నారు. దీనికి ముందు వేల్పూర్ రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎమ్మెల్సీ వీజీగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరిలో చలివేంద్రం ప్రారంభం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉమాకాంత్ దేశముఖ్ ప్రారంభించారు. తొలి రోజు చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు భీమా సాయిరెడ్డి, తెల్ల రవికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు యములు నవీన్, బర్ల మధు, కప్ప సంతోష్, అనిల్, దౌలయ్య, యూత్ సభ్యులు బాన్సువాడ హన్మాండ్లు, గోపి, వీరేశం, యోగేశ్వర్, అరుణ్ గౌడ్, శ్రీకాంత్, మధు, వినోద్ పటేల్, శివ తదితరులు పాల్గొన్నారు.

మెండోరాలో..

బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్‌లో బీజేపీ నాయకుడు మహేందర్‌రెడ్డి చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు మోటార్ వాహనాల పంపిణీ


రైతులకు బహుమతులు అందజేస్తున్న యాజమాన్యం

నందిపేట్: మండలంలోని వెల్మల్‌లో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సభ్యులు శనివారం గ్రోమోర్ రైతు సంబురాల కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. స్లాబ్ ఆధారిత పథకం కింద కోరమండల్ కంపెనీ ప్రసిద్ధి చెందిన ఫర్టిలైజర్, ఎరువులను కొన్న రైతులకు కూపన్లు అందజేసి లక్కీ డ్రా ద్వారా విజేతలైన ఎనిమిది మంది రైతులకు టీవీఎస్ మోపెడ్, రూ. ఐదు వేలు విలువ చేసే వెండి నాణేలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ సీనియర్ అసోసియేటెడ్ ఉపాధ్యక్షుడు పి భాస్కర్‌రెడ్డి, జోనల్ మేనేజర్ మనోజ్ కుమార్, ఎస్ఎస్‌పీ జోనల్ మేనేజర్ మాధవన్, డివిజనల్ ఆగ్రనమిస్ట్ టి సుధాకర్ రెడ్డి, పాపిరెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ కె ప్రసాద్, రమేష్, మహేశ్వర్ రెడ్డి, జి నాగరాజు, శేషన్న, ప్రీతం వైష్ణవ్, వెల్మల్ ఉప సర్పంచ్ నారాయణ, రాంరెడ్డి, గ్రోమో డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయాలి


మాట్లాడుతున్న చైర్మన్ జనార్దన్

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ. 2 లక్షల పంట రుణమాఫీ అమలు చేయాలని సాలూర సొసైటీ మహాజన సభ తీర్మానించింది. శనివారం మండల కేంద్రంలో సాలూర సొసైటీ మహాజన సభ చైర్మన్ అల్లె జనార్దన్ అధ్యక్షతన నిర్వహించారు. సన్‌ఫ్లవర్, మొక్కజొన్న, కుసుపు పంటలకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మరో తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతుల సహకారంతో సంఘం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. సొసైటి ఆర్థిక ప్రగతి నివేదికను సీఈవో బస్వంత్‌రావు పటేల్ చదివి వినిపించారు. వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి, డైరెక్టర్లు సాయిలు, హొట్లప్ప, భూమయ్య, మోహన్ రావు పటేల్, సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


రాయకూర్‌లో ప్రారంభిస్తున్న తహసీల్దార్

రుద్రూర్: మండలంలోని రాయకూర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. అనంతరం విండో ఇన్‌చార్జి సీఈవో సాయికిరణ్ మాట్లాడుతూ.. రాయకూర్ విండో పరిధిలోని చిక్కడపల్లి, రాణంపల్లి, రాయకూర్‌లో ధాన్యాన్ని సేకరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారి శ్రావణి, రైతులు పాల్గొన్నారు.


జాకోరలో..

జాకోరలో..

వర్ని: రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని జిల్లా సహకార ఆడిట్ అధికారి పాపయ్య అన్నారు. మండలంలోని జాకోరాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ. 2203, బి గ్రేడ్ రకానికి రూ. 2183 ధర చెల్లిస్తోందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి



రుద్రూర్: వేసవి కాలంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి సురేశ్‌బాబు జీపీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని బొప్పాపూర్, రుద్రూర్ గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. గ్రామాల్లో ఉన్న నీటి వనరులను పరిశీలించారు. పైప్‌లైన్ లీకేజీలు యుద్ధ ప్రతిపాదికన మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. మండల పంచాయతీ అధికారి సాయిలు, సిబ్బంది ఉన్నారు.


గాదేపల్లిలో లారీ నుంచి కోళ్ల ఎరువుల బస్తాలను ట్రాక్టర్లలో వేస్తున్న సిబ్బంది

బస్తా రూ.120

- కోళ్ల ఎరువును ఎగబడి కొంటున్న రైతులు

డొంకేశ్వర్: కోళ్ల ఎరువులకు డిమాండ్ పెరిగింది. వ్యాపారులు 30 కిలోల బస్తాను రూ.120కి విక్రయిస్తున్నారు. పసుపు పంటను సాగు చేసే రైతులు భూముల్లో బలం కోసం ఈ కోళ్ల ఎరువును వినియోగిస్తున్నారు. వ్యాపారులు గతంలో లారీల్లో విడిగా తీసుకొచ్చి విక్రయించేవారు. ఇప్పుడు రూటుమార్చి బస్తాల చొప్పున అమ్ముతున్నారు. ఐతే, కోళ్ల ఎరువుకు డిమాండ్ ఏర్పడంతో రైతులు ఎగబడి కొంటున్నారు. శనివారం డొంకేశ్వర్ మండలం గాదేపల్లి గ్రామానికి పెద్ద లారీలో కోళ్ల ఎరువులు నింపిన బస్తాలను తీసుకొచ్చారు. చుట్టు పక్కల గ్రామాల రైతులు పోటాపోటీగా కొనుగోలు చేసి తమ ట్రాక్టర్లలో పొలాలకు తరలించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్‌లో చేరిన ఆలూర్ నాయకులు

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి వినయ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, నవనీత్, ఉదయ్, సంజీవ్, వంశీ, మహేశ్, మోతె శ్రీను, ముత్యం, హరీశ్, పవన్, చిరంజీవి, గంగాధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.


డొంకేశ్వర్ నాయకులు..

డొంకేశ్వర్‌లో..

డొంకేశ్వర్: మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నూత్‌పల్లి ఎంపీటీసీ గంగామణి సంజీవ్, తొండాకూర్ మాజీ సర్పంచ్ దశగౌడ్‌లను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గొడిశరం భూమేశ్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు దేగం గంగారెడ్డి, సాయినాథ్ గౌడ్, సాయిరెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన దూపల్లి గ్రామస్తులు



రెంజల్: దూపల్లి గ్రామానికి చెందిన పలువురు జిల్లా కేంద్రంలోని బీజేపీ క్యాంప్ కార్యాలయంలో ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో శనివారం చేరారు. గ్రామానికి చెందిన బోయి, రజక కుల సంఘాల పెద్దలతో పాటు పలువురు యువకులు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. వీరికి ఎంపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపికృష్ణ, వైస్ ఎంపీపీ యోగేశ్, జిల్లా ఉపాధ్యక్ష్యుడు సంతోష్, ప్రసాద్, బక్కయ్య, మహేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నందిపేట్: ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం మండల నూతన కార్యవర్గం శనివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా భూమేశ్, ఉపాధ్యక్షుడిగా ధర్మపురి, జనరల్ సెక్రటరీగా సాయన్న, క్యాషియర్‌గా సునీల్, జాయింట్ సెక్రటరీగా తిరుమలేశ్, అడ్వయిజర్లుగా మోహన్, భూషణ్, భోజన్న, ప్రభాకర్, రామరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మహేశ్, శ్రీనివాస్, రంజిత్, కిరణ్, గంగప్రసాద్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) – 11.40, 2.20, 5.00, 7.40, 10.20
స్క్రీన్-2 –	టిల్లు స్క్వేర్ (తెలుగు) – 10.20, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-3 –	ది గోట్ లైఫ్ (తెలుగు) – 11.05, 6.00, 9.40
స్క్రీన్-4 –	క్రూ – 10.10, 4.10, 7.00, 10.10 ఓం భీమ్ బుష్ – 04.04

ఎంపీపీపై వీగిన అవిశ్వాసం


సమావేశం బయట ఉన్న కాంగ్రెస్ ఎంపీటీసీలు

మాక్లూర్: ఎంపీపీ మాస్త ప్రభాకర్‌పై కాంగ్రెస్‌పార్టీ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసం శనివారం వీగిపోయింది. 14 మంది ఎంపీటీసీలలో 9 మంది ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ కలెక్టర్‌కు లేఖ అందించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 10.30 గంటలకు ఆర్డీవో రాజేంద్ర కుమార్ కార్యాలయానికి వచ్చారు. అవిశ్వాసం పెట్టిన 9 మంది కాంగ్రెస్ ఎంపీటీసీల్లో ఒకరు గైర్హాజరయ్యారు. హాలులో ఉన్న ఎంపీటీసీలను సంతకాలను పెట్టాలని ఆర్డీవో కోరగా మరోకరు రావాల్సి ఉందని చెప్పి హాల్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీటీసీలు బయటకు వచ్చారు. దీంతో సమయం దాటిపోవడంతో ఎంపీపీ ప్రభాకర్‌పై కాంగ్రెస్ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

రంజాన్ తోఫా అందజేత

రుద్రూర్: పొతంగల్ మండలంలోని పాత పొతంగల్‌లో పేద ముస్లిం కుటుంబాలకు కో–ఆప్షన్ మాజీ సభ్యుడు ఎంఏ హకీం రంజాన్ తోఫాను శనివారం అందచేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుప్పాల శంకర్, మాజీ ఎంపీపీ గందపు పవన్‌కుమార్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కృష్ణవేణిలో సైన్స్ ఎక్స్‌పో



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. సాంకేతికతపై విద్యార్థులకు పట్టు రావడానికి సైన్స్ ఎక్స్‌పో నిర్వహించినట్లు ప్రిన్సిపల్ మహ్మద్ మీనాజ్ తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్నా ఓ బూటకం

భీమ్‌గల్: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రైతుల పేరిట చేస్తున్న ధర్నా ఓ బూటకమని, గతంలో మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నడూ రైతులను పట్టించుకోలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగేంద్ర, మహేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బోధన్: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ అనుబంధం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం సాలూర తహసీల్ కార్యాలయం ఎదుట యూనియన్ నాయకులు, జీపీ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్ మాట్లాడుతూ.. కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. నాయకులు, కార్మికులు శంకర్, గంగాధర్, సతీశ్, రాములు, రాహుల్, సాయిలు, శంకర్, లక్ష్మీబాయి, సక్కుబాయి, సావిత్రి, గంగవ్వ, గోదావరి పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

డొంకేశ్వర్: మండలం కేంద్రంలో రేణుకాఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పుట్ట ఎలమ్మతో పాటు ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. గుడి ముందు పందిరి వేసి మొదటి రోజు భక్తులు మొక్కలు తీర్చుకున్నారు. ఆదివారం, సోమవారాల్లో బోనాలు, మూడో రోజు కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని గౌడ సంఘ సభ్యులు తెలిపారు.

గోపు లక్ష్మి అవినీతిని బయటపెట్టాలి


కార్యదర్శిని నిలదీస్తున్న రైతు పోశెట్టి

మాక్లూర్: నాలుగేళ్ల కాలంలో గత చైర్‌పర్సన్ గోపు లక్ష్మి చేసిన అవినీతిని బయట పెట్టాలని రైతులు మహాజన సభలో డిమాండ్ చేశారు. మండలంలోని వ్యవసాయ పరపతి సంఘంలో చైర్మన్ బూరోల్ల అశోక్ అధ్యక్షతన 83వ మహాజన సభను శనివారం నిర్వహించారు. ముందుగా కార్యదర్శి సంతోష్ సంఘం లావాదేవీలను చదివి వినిపిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. ముందుగా గత చైర్‌పర్సన్ గోపు లక్ష్మి తన కుమారుడు గోపు రంజిత్‌ను అడ్డం పెట్టుకుని చేసిన అవినీతిని బయటపెట్టాలని ఆ తర్వాతే సభ కొనసాగించాలని రైతులు పట్టుబట్టారు. 2019–20లో రూ.కోటికి పైగా నిధులు దుర్వినియోగమైనట్లు విచారణలో తేలినందున ఈ మూడేళ్ల కాలంలో ఇంకెంత డబ్బు దిగమింగారనేది ఇటీవల విచారణలో తేలిందన్నారు. ఈ విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారని రైతులు కార్యదర్శిని నిలదీశారు. దుర్వినియోగమైన డబ్బులను రికవరీ చేసేందుకు తీర్మానం చేయాలన్నారు. గ్రామానికి ఐదుగురు రైతులు చొప్పున కమిటీని ఏర్పాటు చేసుకుని డబ్బుల రికవరీపై సీఎంను కలవాలని తీర్మానం చేశారు. నిధుల దుర్వినియోగంలో కార్యదర్శి పాత్ర ఉందని రైతులు ఆరోపించారు. చైర్మన్ అశోక్ మాట్లాడుతూ.. తాను రైతుల పక్షాన ఉండి పని చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు కొట్టాల లింగారావు, కాశీనాథ్‌రావు, డేగ పోశెట్టి, గంగాధర్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, మచ్చర్ల రమేశ్, శేఖర్, గంగారాం, రవిప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.